క్లుప్తంగా

ప్రజాసంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్

బాలాయపల్లి (సైదాపురం): నూతన ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బాలాయపల్లి మండలంలోని కడగుంట ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గ్రామ సర్పంచ్ అంకయ్య అధ్యక్షతన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే శ్రీసిటీలో రూ.1500 కోట్ల పెట్టుబడులతో పలు పరిశ్రమలను శంఖుస్థాపనలతో పాటు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు చీర, పసుపు కుంకమలను అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎల్‌డీఓ వాణి, ఎంపీడీఓ వినీల్‌కుమార్, డీటీ శిరిషీ, డీఎల్‌పీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్షల కోసం విచ్చేసిన మహిళలు

దొరవారిసత్రం: మండలంలోని పోలిరెడ్డిపాళెంలో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ సహకారంతో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలు, పురుషుల్లో నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హరిత, ఎంపీటీసీ వెంకటత్నమ్మ, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



ర్యాలీ చేస్తున్న వామపక్షాల నేతలు

సైదాపురం: నిరుపేదల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం సైదాపురంలో సోమవారం అఖిల భారత రైతు కూలీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమించుకున్న భూ పట్టాలను రద్దు చేసి యానాదులకు భూములను పంపిణీ చేయాలన్నారు. అలాగే కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యసేవలు



కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

వెంకటగిరిరూరల్ : పట్టణంలో పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ జిలాని ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు పలు రకాల వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు కేవీ వసుధ, చరీష్మ, దివ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



హైజంప్‌లో ప్రతిభ చూపిన చైతన్య

రాపూరు: మండలంలోని గోనుపల్లి గ్రామంలోని కరుణామయి విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న చైతన్య జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మస్తానయ్య తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి వెంకటగిరిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 100 మీటర్లు, హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థిని కరస్పాండెంట్ భరత్‌బాబు,ఉపాధ్యాయులు అభినందించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరుకు చెందిన గిరిజనులకు సోమవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన తనమాల మధుసూదన్ రెడ్డి జయంతి సందర్భంగా సత్యసాయి వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బి.మోహన్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పస్తులుంటున్నాం



నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించి గని కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన
- మైనింగ్ డీలర్ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తమకు ఈ దుస్థితి అని గళమెత్తిన కార్మికలోకం

చిల్లకూరు: రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా తాము పస్తులు ఉంటున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గూడూరు, చిల్లకూరు, సైదాపురం మండలాల్లోని ఖనిజసంపద డీలర్లు, కార్మికులు గూడూరు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో పలు రకాల ఖనిజసంపద పుష్కలంగా ఉండడంతో ఇక్కడ ఉన్న పలు గ్రామాల ప్రజలు మైనింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా నిలిపి వేయడంతో పనులు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. డివిజన్‌లోని గూడూరురూరల్, సైదాపురం, చిల్లకూరు, కోట మండలాల్లోని వేల మంది కార్మికులు తినడానికి కూడా లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఖనిజ సంపదను కొనగోలు చేసి విక్రయించుకునేందుకు అనుమతులు పొందిన డీలర్లు వ్యాపారాలు లేకపోవడంతో వారికి అనుబంధంగా ఉండే లారీల యజమానులు, డ్రైవర్లు, అసోసియేషన్లు, క్లీనర్లు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

మంత్రులకు చెప్పినా.. ఫలితం లేదు..

పలుమార్లు మంత్రులకు కూడా వినతులు ఇచ్చినప్పటికీ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందువల్లే డీలర్ల అసోసియేషన్, కార్మికులు నిరసనలకు శ్రీకారం చుట్టాల్సి వచ్చిందన్నారు. గతవారం మైనింగ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో సమస్యను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన చేపట్టడం జరుగుతోందన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందించి సమస్యను వివరించారు. డివిజన్ పరిధిలోని కార్జ్‌తో పాటుగా సిలికా, వర్మికులైట్ లాంటి ఖనిజ సంపద లీజుదారులకు అనుమతులు మంజూరు చేసి వారి వద్ద నుంచి తాము ఆయా ఖనిజాలను కొనుగోలు చేసుకుని విక్రయించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ వారంలోపు సమస్యను పరిష్కరించేలా కలెక్టర్‌తో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మైనింగ్‌శాఖ ఏడీ రంగకుమార్ తదితరులు ఉన్నారు.

నాలుగు నెలలుగా వర్షాలు పడవు..



గ్రామానికి సమీపంలో ఉన్న తెల్లరాయి గనిలో రోజువారీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవాన్ని. అయితే ఎన్నికలకు ముందుగా పనులు నిలిపివేశారు. ప్రభుత్వం మారింది. పనులు మొదలు పెడతారనుకుంటే, ఎక్కడా తవ్వకాలు చేయకూడదని నిబంధనలు పెట్టారు. దీంతో నాలుగు నెలలుగా పనులు లేవు. వ్యవసాయ పనులకు వెళ్దామంటే వర్షాలు పడవు. ఎలా బతకాలి ? **- సుందరయ్య, తిరువెంగళాయపల్లి, తెల్లరాయి పరిశ్రమ కార్మికుడు**

కంతు ఎలా కట్టేది ?



గనిలో పనికిపోతే రోజు రూ.600 వరకు వస్తాది. అలాంటిది నాలుగు నెలలుగా పనులు లేకుండా చేసేశారు. దీంతో కుటుంబం ఎట్టాగడపాలి ? పొదుపునకు కంతులు ఎలా కట్టుకోవాలి? అప్పు ఇచ్చిన వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలియడం లేదు. ఇలా అయితే ఎలా బతకాలో చెప్పండి ? **- రేణుకమ్మ, చెమిర్తి, కార్మికురాలు**

పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం తన నివాసంలో వ్యవసాయశాఖ అధికారులు రూపొందించిన 'పొలం పిలుస్తోంది' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చులతో అధిక లాభాలు వచ్చేదిశగా అధికారులు రైతులకు సహకరించాలన్నారు. వ్యవసాయశాఖ అనుబంధ అధికారులు, శాస్త్రవేత్తలు, అధికారులు పంటల సాగు, ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించి నాణ్యమైన పంటల దిగుబడి సాధించేలా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్, ఏఓలు సుజాత, శిరీష, వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం : ఏకొల్లు పంచాయతీ పరిధిలోని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం ఏకొల్లు గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఊరిలోని భూసమస్యలతో పాటు తాగునీరు, బ్రిడ్జి, ఎస్టీ కాలనీలో పక్కా గృహాలు తదితర వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అదేవిధంగా 'పొలం పిలుస్తోంది' వాల్ పోస్టర్లను వ్యవసాయాధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే పరసారత్నం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

సూళ్లూరుపేట రూరల్ : 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏఓ కవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు మన్నారుపోలూరు, మధ్యాహ్నం 3 గంటలకు కోటపోలూరులో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనుబంధ శాఖలైన పశుసంవర్ధక శాఖ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు.

వాకాడులో..

వాకాడు : నేటి నుంచి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని ఏఓ దీప తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున, తొలి రోజు కొండూరు, దుగ్గరాజపట్నం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న అధికారులు

దక్కిలి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల పరిషత్ సూపరింటెండెంట్ అనురాధ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

గూడూరురూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్సు పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు సైన్స్‌పై మంచి విజ్ఞానం సాధించుకునేందుకు ఎంతగానో దోహద పడతాయని జేవీవీ నాయకులు అన్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్‌లో సోమవారం సైన్స్‌టాలెంట్ పరీక్షలకు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయిలో అక్టోబర్ 1న జిల్లా స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్సు టాలెంట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకుని నేరుగా పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. అలాగే విద్యార్థులు మూఢనమ్మకాలపై వారి ప్రాంతాల్లో ప్రజలకు వివరించి ఆత్మవిశ్వాసం నింపాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షులు చెంచు నారాయణ, పురుషోత్తంరావు, ప్రభాకర్, పవన్‌కుమార్, సుబ్బారావు, ఆనంద్, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఫజులుల్లా

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీకి కొత్త కమిషనర్ షేక్ ఫజులుల్లా నియమితులైనట్లు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న అతన్ని నాయుడుపేటకు బదిలీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న జనార్ధన్ రెడ్డిని సొంతశాఖ పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేశారు. త్వరలోనే ఫజులుల్లా నాయుడుపేట కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

నేదురుమల్లి పద్మనాభరెడ్డికి నివాళి



వాకాడు : వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యుడు దివంగత డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి తొలి వర్ధంతిని సోమవారం వాకాడులోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉపాధ్యాయులు పద్మనాభరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి, కొడవలూరు దామోదర్‌రెడ్డి, పల్లంపర్తి గోపాల్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేలు వితరణ

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులకు అందించే ఉచిత మధ్యాహ్న భోజనానికి వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూధన్‌రెడ్డి సోమవారం రూ.20 వేలు వితరణగా అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హనుమంతయ్య తెలిపారు. దాతల సహకారంతో పేద విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించామని దాతలు సహకరించాలని ఆయన కోరారు.

33 మద్యం బాటిళ్లు స్వాధీనం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో సోమవారం ఓ టీ దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బాబి తెలిపారు. వివరాలు ఇలా.. నాయుడుపేట ఎస్‌ఐ ప్రేమయ్య సోమవారం మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో ఉన్న టీ దుకాణాల్లో తనిఖీలు చేట్టారు. అందులో ఓ టీ దుకాణంలో విన్నమాల గ్రామానికి చెందిన తీపల పూడి ప్రసాద్ అనే వ్యక్తి మద్యం బాటిళ్లను నిల్వ చేసి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితున్ని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

దొరవారిసత్రం : మండలంలోని సింగనాత్తూరు గ్రామం ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి తన భార్యపై కత్తితో దాడి చేసి గాయపరచిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. సింగనాలత్తూరు ఎస్సీ కాలనీకి చెందిన కోటయ్య తన భార్య కోటమ్మ నాలుగు రోజుల కిందట గొడవ పడ్డారు. ఈక్రమంలో కోటమ్మ తన అమ్మ పుట్టిల్లు అయిన కారికాడు గ్రామానికి వెళ్లి ఆదివారం తిరిగి ఇంటికి వచ్చింది. మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన కోటయ్య భార్య కోటమ్మపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. అడ్డువెళ్లిన అత్త మస్తానమ్మపై కూడా దాడి చేశాడు. వెంటనే గాయపడిన వారిని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకుకూరలతో పోషకాలు

గూడూరురూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యం, ఆకుకూరలు తింటే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గోపినాయక్ తెలిపారు. చిల్లకూరు మండలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్న, సన్నకారు రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలను విక్రయించేందుకు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా స్టాల్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన ఆకుకూరలు, కూరగాయలను పరిశీలించి తాజాగా ఉన్న వాటిని తింటే మంచి విటమిన్లు పుష్కలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు కృష్ణయ్య, పూర్ణిమ, ధనుంజయ్, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదాల గ్రామోత్సవం



పట్టణ ప్రధాన వీధుల్లో బంగారు పాదాల గ్రామోత్సవం



అమ్మవారి పాదాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి ఇలవేల్పు శ్రీ పోలేరమ్మతల్లి జాతర పురస్కరించుకుని ఈ ఏడాది అమ్మవారికి దాతల సహకారంతో నూతనంగా తయారు చేసిన శ్రీ పోలేరమ్మతల్లి బంగారు పాదాల గ్రామోత్సవం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. పట్టణంలోని త్రిభువని సెంటర్ వద్ద నుంచి ప్రత్యేక వాహనంలో పూలతో విశేషంగా అలంకరించి అమ్మవారి బంగారు పాదాలు పట్టణ పురప్రజల దర్శనార్థం మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. నగరోత్సవం త్రిభువని సెంటర్ వద్ద నుంచి కాశీపేట సెంటర్, రాజావీధి మీదుగా పోలేరమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయం వద్ద రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి బంగారు పాదాలను ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డికి అప్పగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వెంకటగిరి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో ఈనెల 25, 26 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్న గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర ఏర్పాట్లను తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. సోమవారం ఆయన పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని అమ్మవారిని తయారు చేసే కుమ్మరవీధి, మెట్టినిల్లు అయిన జీనుగలవారి వీధి, బజారు వీధి, అమ్మవారి ఆలయ ప్రాంగణం, రాజావీధి, అమ్మవారి నిష్క్రమణ ప్రదేశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ జాతరలో 1200 మందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బుధ, గురు వారాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వాహనాలను దారి మళ్లిస్తామని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. తొలుత ఆయన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీ వీవీ రమణకుమార్, సీఐ ఏవీ రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ఆహార ఉత్పత్తుల స్టాళ్లను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలను తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. సోమవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటల్లో పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. స్టాల్స్‌లో ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి గడ్డలు, పండ్లను అందుబాటులో ఉంచడం శుభపరిణామం అన్నారు. సహజసిద్ధంగా పండించిన ఉత్పత్తులను తీసుకోవడం వల్ల పోషక విలువలు పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. కూరగాయలు తక్కువ ధరలకే విక్రయిస్తున్నామని తెలిపారు. మండలంలో ఆర్మేనిపాడు, ఇనుగుంట, చిలమానుచేను, గుర్రంకొండ తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ మోహన్, ఏపీఎం నిర్మలమ్మ, గూడూరు డివిజన్, ఓజిలి మండల ఇన్‌చార్జ్‌లు వీరరాఘవయ్య, జైతున్‌బీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలే శరణ్యం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్మేనిపాడు గ్రామస్తులు

ఓజిలి: ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే క్వారీ ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని ఆర్మేనిపాడు గ్రామస్తులు వాపోతున్నారు. క్వారీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి ఉంటే వాటిని రద్దు చేయాలని సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందనలో ఆర్మేనిపాడు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారని క్వారీ యజమానులు గ్రావెల్ తవ్వేందుకు వస్తే అడ్డుకున్నామన్నారు. తమ గ్రామంలో మైనింగ్ క్వారీకి అనుమతుల ఇవ్వడానికి గ్రామస్తులంతా వ్యతిరేకమన్నారు. గ్రామంలో పశువులు, మేకలు, గొర్రెలు వంటి పశుసంపద అధికంగా ఉందన్నారు. కొండకు క్వారీ అనుమతులు ఇస్తే మూగజీవాలకు మేత దొరకడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొంత మంది క్వారీ ఏర్పాటు చేయడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన అధికారులు ఆర్డీఓ, మైనింగ్ అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఓజిలి తహసీల్దార్ పద్మావతికి క్వారీ ఏర్పాటుకు అనుమతులు రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు.

నూతన ఈఈగా శ్రీనివాసులు



శ్రీనివాసులును స్వాగతిస్తున్న అధికారులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట డివిజన్ విద్యుత్ శాఖ (ఏపీఎస్పీడీసీఎల్) ఈఈగా వై.శ్రీనివాసులు సోమవారం కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన ప్రసన్నకుమార్ ఉద్యోగ విరమణ చేశారు. కొత్తగా బాధ్యతలను చేపట్టిన శ్రీనివాసులు పులివెందులలో ఈఈగా పని చేస్తూ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. నాయుడుపేట సబ్ డివిజన్ డీఈ శేఖర్ పాటు సూళ్లూరుపేట వెంకటగిరి సబ్‌డివిజన్‌లోని డీఈలు, ఏఈలు బాధ్యతలను స్వీకరించిన ఈఈ శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. నాయుడుపేట డివిజన్‌కు సంబంధించి శాఖాపరమైన పలు విషయాలను అధికారులతో చర్చించారు. అనంతరం వెంకటగిరిలో జరిగే జాతరకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలన చేసేందుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తుండడంతో ఈఈ అక్కడకు వెళ్లారు.

కత్తులు, కర్రలతో దాడి



ఘర్షణకు దారితీసిన కారణాల గురించి విచారిస్తున్న సీఐ సంఘమేశ్వరరావు



చికిత్స పొందుతున్న సుబ్రమణ్యం

దొరవారిసత్రం: పాత కక్షల కారణంగా రెండు వర్గాలు కత్తులు, కర్రలతో దాడికి దిగిన ఘటన మండలంలోని మొదుగులపాళెం గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మొదుగులపాళెం ఎస్సీ కాలనీకి చెందిన ఒక వర్గంలోని మామారి సుబ్రమణ్యం, అతని అన్న కుమారుడు చందు, మరో వర్గానికి చెందిన మాయారి సురేష్, మునిచంద్ర, పూనమల్లి మునిచంద్ర, శాంతలం మాధవ్ మరికొంత మంది ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డారు. ఓ వర్గానికి చెందిన వారు కత్తులతో దాడికి దిగగా.. మరో వర్గం వారు కర్రలతో దాడి చేశారు. ఈ దాడుల్లో సుబ్రమణ్యంకి కత్తి పోట్లు పడ్డాయి. మరో వర్గానికి చెందిన వారు మునిశేఖర్‌పై కర్రలతో దాడి చేయడంతో గాయపడ్డాడు. కత్తి పోట్లకు గురైన సుబ్రమణ్యంను చికిత్స నిమిత్తం 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఇరువర్గాల ఘర్షణతో మొదుగుపాళెం ఎస్సీ కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. స్థానిక ఎస్‌ఐ అయజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణకు కారణమైన వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాయుడుపేట, సూళ్లూరుపేట సీఐ సంఘమేశ్వరరావు, గిరిబాబు, ఎస్‌ఐలు నాగరాజు, బ్రహ్మానాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల మధ్య వివాదాలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అనంతరం ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.